క్లుప్తంగా

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



కోనరావుపేటలో సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

కోనరావుపేట: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్ అన్నారు. మండలంలోని పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రేవోజు సదానందం, మండల అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం

సిరిసిల్లటౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని తెలంగాణ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫోరం చేపట్టింది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు కళాశాలల్లో పట్టభద్రులతో ఓటరు నమోదు నిర్వహించారు. పట్టభద్రుల సమస్యలపై గళం వినిపించేవారినే గెలిపించాలని వక్తలు కోరారు. టీటీఎల్ఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మాసం రత్నాకర్, నాయకుడు కనపర్తి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయాలి

కోనరావుపేట: 30 శాతం ఫిట్‌మెంట్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ పీఆర్సీని అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పర్కాల రవీందర్, జంగిటి రాజు, గాలిపల్లి సంతోష్, గొల్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

24న హుండీ లెక్కింపు

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకున్న భక్తులు హుండీల్లో వేసిన కట్నాలు, కానుకలను ఆలయ అధికారులు ఈనెల 24న స్వామివారి ఓపెన్ స్లాబ్‌లో లెక్కించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ముస్తాబాద్: నామాపూర్ మోడల్ స్కూల్‌లో గంటల ప్రాతిపదికన పని చేసేందుకు అర్హత గల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ నర్సింహరాజు తెలిపారు. టీజీటీ తెలుగు-1, పీజీటీ ఆంగ్లం-1, గణితం-2, జంతుశాస్త్రం-1 పోస్టులున్నాయన్నారు. సెప్టెంబర్ 24 లోగా దరఖాస్తులు చేసుకోవాలని, 25న డెమో, ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

సిరిసిల్ల కల్చరల్: అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధుల శ్రేయస్సు, సంక్షేమం కోసం పాటుపడుతున్న వారికి పురస్కారాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మిరాజం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారాలకు అర్హత, ఆసక్తి గల వ్యక్తులు, సంస్థల నిర్వాహకులు ఈనెల 25 లోపు హైదరాబాద్ మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ భవనంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైనవారికి అక్టోబర్ 1న అవార్డులు అందజేస్తామని ప్రకటించారు.

టీపీసీసీ అధ్యక్షున్ని కలిసిన కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట: టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ మండల నాయకులు శుక్రవారం గాంధీ భవన్‌లో కలిశారు. పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. దమ్మ శ్రీనివాస్‌రెడ్డి, జోగు సురేశ్, అంబటి ఎల్లయ్య, అక్బర్‌ఖాన్, బందెల రాజు, అబ్బురవేని రాజు తదితరులున్నారు.

శివకేశవుల ఆలయ కమిటీ చైర్మన్‌గా దేవయ్య

ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని శ్రీశివకేశవుల ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎలుసాని దేవయ్య మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు


రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకులు, చిత్రంలో మంత్రి పొన్నం, విప్ ఆది

వేములవాడ: గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం జీవో విడుదల చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్, గల్ఫ్ జేఏసీ బృందం మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. వినోద్‌కుమార్, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, మంద భీంరెడ్డి, చెన్నమనేని శ్రీనివాసరావు, తోట ధర్మేందర్, గుగ్గిళ్ల రవిగౌడ్, మచ్చ మల్లికార్జున్, దువాస రామకృష్ణ, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, షేర్ నర్సారెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న మహాలక్ష్మి బెలూన్



సిరిసిల్ల: కలెక్టరేట్‌లో మహాలక్ష్మి పథక ప్రచారం బెలూన్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. రూ.500కే సిలిండర్ అంటూ భారీ బెలూన్‌ను కలెక్టరేట్ ప్రవేశ ద్వారం ప్రజావాణి దరఖాస్తులు స్వీకరించే ప్రదేశంలో ఉంచారు. సిలిండర్ రూపంలో బెలూన్‌ను తీర్చిదిద్దడంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇందిరమ్మ ఫొటో, ఆరు గ్యారంటీల చిత్రాన్ని ఆవిష్కరించారు. భారీ బెలూన్‌లోకి ప్రత్యేక యంత్రం ద్వారా గాలి ఎక్కించారు. బెలూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

తెగుళ్ల బారి నుంచి పంటలను రక్షించుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న ఎంఏవో ప్రణీతారెడ్డి

బోయినపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల వరి పంటలో అగ్గి తెగులు, బ్యాక్టీరియా, ఎండాకు తెగులు వ్యాప్తి చెందే అవకాశముందని ఎంఏవో కె.ప్రణీతారెడ్డి పేర్కొన్నారు. ఏఈవోలతో కలిసి మర్లపేట, బూర్గుపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో శుక్రవారం రైతుల వరి చేలను పరిశీలించారు. తెగుళ్లు సోకితే తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, వాడాల్సిన మందులు రైతులకు సూచించారు. ఏఈవో శ్రీదేవి ఉన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన


గంభీరావుపేట: అవగాహన కల్పిస్తున్న సింగిల్‌విండో కార్యాలయ సిబ్బంది

గంభీరావుపేట: గంభీరావుపేట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి చెందిన విద్యార్థులు శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. గ్రామంలోని సింగిల్‌విండో కార్యాలయం, పెస్టిసైడ్, ఫర్టిలైజర్ దుకాణాలను సందర్శించారు. వరి పంటకు వినియోగించే ఎరువులు, క్రిమిసంహారక మందులు, స్ప్రే తదితర అంశాలపై కార్యాలయ, దుకాణ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రత్యేకాధికారి వసంత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థుల పని అనుభవ కార్యక్రమం

రుద్రంగి: జిల్లెల్లలోని బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల నాల్గో సంవత్సరం విద్యార్థులు శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా గ్రామీణ విశ్లేషణాత్మక తులనం నిర్వహించారు. గ్రామంలో రైతులు పండిస్తున్న పంటలు, వాటి విస్తరణ, కాలానుగుణంగా గ్రామాభివృద్ధి, వ్యవసాయ కాలచక్రం, గ్రామ వనరులను వివిధ రకాల పటాల ద్వారా రైతులకు వివరించారు. రుద్రంగి కార్యదర్శి రాందాస్, ఏఈవో జ్యోతి, నాయకులు తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, వ్యవసాయ విద్యార్థులు జాహ్నవి, దివ్య, లావణ్య, కావ్య, వైష్ణవి పాల్గొన్నారు.


రుద్రంగి రైతు వేదికలో రైతులకు పటాల ద్వారా వివరిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

విద్యార్థి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలి


విద్యార్థిని పరామర్శిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గంభీరావుపేట: ఇల్లంతకుంట మండలం గాలిపల్లి హాస్టల్‌లో పాముకాటుకు గురైన విద్యార్థి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పరామర్శించారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేశ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాజేశ్, నాయకులు సామర్ల సాయి, భరత్ పాల్గొన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్, మండల అధ్యక్షుడు జుబేర్, అనిల్, ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్, కాంగ్రెస్ మండల నాయకులు దొమ్మాటి నర్సయ్య, లక్ష్మారెడ్డి, షేక్ గౌస్, బాల్‌రెడ్డి, రాంరెడ్డి పరామర్శించారు.

బాధితులకు పరామర్శ

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలోని ఇస్లాంనగర్‌లో అనారోగ్యంతో ఉన్న సయ్యద్ ఇమామ్, షేక్ ఇమామ్‌ను శుక్రవారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. వాసాల శ్రీనివాస్, రెహమాన్, హైదర్, కలీం, శాదుల్ల, అక్బర్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ముస్తాబాద్: ముస్తాబాద్‌కు చెందిన వేముల మల్లేశం అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకోగా.. బాధిత కుటుంబానికి పోచమ్మ యూత్ సభ్యులు అండగా నిలిచారు. శుక్రవారం నగదు, 50 కిలోల బియ్యం అందించారు.

కార్మిక ప్రయోజనాలను అమలు చేయాలి


కోనరావుపేటలో మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట: కార్మికుల సమస్యలు పరిష్కరించి వారి ప్రయోజనాలను అమలు చేయాలని ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. కోనరావుపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కోనరావుపేట సూతారి సంఘం పట్టణ కార్యదర్శి బొల్లే బాబు, శ్రీనివాస్, రాజన్న, శంకర్, శ్రీను, దేవయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బోయినపల్లి: ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని సీఐటీయూ భవన నిర్మాణ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గురజాల శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలను కార్మికులకందించాలని కోరారు. ఈనెల 23న చలో హైదరాబాద్ పేరిట లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. బొజ్జ శ్రీను, బొడ్డు రాజలింగం, ఎడపెల్లి రాజు, కల్లెపెల్లి శంకర్, ఎడపల్లి బాబు, అల్వాల నాంపల్లి తదితరులున్నారు.

ముస్లింల ర్యాలీ


ఇల్లంతకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఇల్లంతకుంట: మిలాద్ ఉన్ నబీ వేడుకలు పురస్కరించుకొని మండల కేంద్రంలో ముస్లింలు శుక్రవారం ర్యాలీ తీశారు. మసీదులో నమాజ్ చేసిన అనంతరం మసీదు నుంచి ఇల్లంతకుంట బస్టాండ్ ప్రాంతం వరకు ర్యాలీ నిర్వహించారు.

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండలంలో ముస్లింలు శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. దర్గాల్లో ప్రార్థనలు చేశారు. ముస్లిం కమిటీ మండల అధ్యక్షుడు షాదుల్లా, నాయకులు జబ్బర్, ఎస్కే సాహెబ్, మత పెద్దలు ఇర్ఫాన్, నవాబ్, జహంగీర్, తాజ్‌లాల్, సద్దాం, ఫారుక్, షారుక్, షౌకత్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల ఇస్లాంపుర యూత్ ఆధ్వర్యంలో ఖీర్(స్వీటు) పంపిణీ చేశారు. అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బుర్ర రాజు, సభ్యులు పాల్గొన్నారు.

తీగల అపహరణ

కోనరావుపేట: శివంగాలపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతుల పొలాల వద్ద ఉన్న విద్యుత్ కేబుళ్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. శివంగాలపల్లి గ్రామానికి చెందిన దండ్రేకుల ప్రభాకర్‌కు చెందిన రూ.10వేల విలువైన కేబుల్, లింగంపెల్లి శ్రీనుకు చెందిన రూ.15వేల విలువైన తీగలు ఎత్తుకెళ్లారు. గంగాధర నరేశ్, నేరెళ్ల సుధాకర్, దండ్రేకుల సత్తయ్య, నారాయణ, నోముల గోపాల్‌రెడ్డికి చెందిన మోటార్ తీగలను ఎత్తుకెళ్లారు. కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చిల్లర దొంగల హల్‌చల్

వేములవాడ: పట్టణంలో చిల్లర దొంగలు రెచ్చిపోతున్నారు. ఆలయం వద్ద బైక్‌లను తీసుకెళ్లడం, నిర్మాణంలో ఉన్న భవనాల్లో విలువైన వస్తువులను దొంగలిస్తూ యజమానులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పట్టణంతోపాటు శివారు ప్రాంతాల్లో భవనాల్లో నిర్మాణం కోసం తీసుకొచ్చిన విలువైన వస్తువులు, కరెంటు తీగలు, ఇతరత్రా సామగ్రిని చోరీ చేస్తున్నారు. సుబ్రహ్మణ్యంనగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో దాదాపు రూ.లక్ష విలువైన సామగ్రిని దొంగలించగా.. సీసీ కెమెరాల ఆధారంగా లభించిన ఆధారాలతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

సంక్షిప్త వార్తలు

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

బోయినపల్లి: మండల కేంద్రంలోని సింగిల్‌విండో, కేడీసీసీ బ్యాంకు పరిసరాల్లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కేటాయించిన నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం రాత్రి స్థానిక నాయకులు ప్రారంభించారు. గుడి శ్రీనివాసరెడ్డి, సంబ లక్ష్మిరాజం, బోయిని ఎల్లేశ్, ఏనుగుల ప్రశాంత్‌కుమార్, నరేశ్ తదితరులున్నారు.

పాఠశాలకు సౌండ్ బాక్స్ వితరణ

గంభీరావుపేట: దమ్మన్నపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు వీఎస్‌ఆర్ ఫౌండేషన్ సిద్దిపేట వారు మల్టీపర్పస్ సౌండ్ బాక్స్, వాల్ క్లాక్‌లను వితరణ చేశారు. చైర్మన్ వంగ మహేందర్‌రెడ్డి శుక్రవారం వాటిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావుకు అందించారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ పల్లె స్నేహ, సీనియర్ ఉపాధ్యాయులు బోయన్నగారి నారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కార్డులు పంపిణీ

గంభీరావుపేట: సముద్రలింగాపూర్‌లో రూ.500 గ్యాస్ సబ్సిడీ పొందుతున్న లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, మాజీ సర్పంచ్ పూజం భూమరాజం, నాయకులు రాంచంద్రం, రాజయ్య, కనకరాజు, వేణుగోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ చొరవతో మంచినీరు

తంగళ్లపల్లి: చిన్నలింగాపూర్ గ్రామం ఎస్సీకాలనీలో మంచినీటి సరఫరా నిలిచిపోయిందని మహిళలు పంచాయతీ ఎదుట నిరసన తెలిపారు. వెంటనే స్పందించిన మాజీ ఎంపీటీసీ బైరినేని రాము శుక్రవారం కొత్త బోరు మోటారును ఏర్పాటు చేయడంతో మంచినీటి సమస్య తీరింది.

పోషకాహారం అందజేత

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడులో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ మాసానికి గాను కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, 5 సంవత్సరాల్లోపు పిల్లలకు ఏఎన్‌ఎంలు శుక్రవారం రక్త పరీక్షలు చేసి పోషకాహారాన్ని అందించారు. కౌన్సిలర్ సత్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బూర నాగరాజు, ఏఎన్‌ఎంలు శ్రావణి, అనిత, ఆశ వర్కర్ కళావతి, అంగన్‌వాడీ టీచర్ పద్మ, బూర యాదగిరి పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో రాణించాలి


విజేతలకు బహుమతుల అందజేత

వేములవాడరూరల్: నూకలమర్రి, హన్మాజిపేట గ్రామాల్లో రెండు రోజులుగా ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు. ఏడు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు బూర సదానందం మాట్లాడుతూ.. మండలస్థాయిలో గెలిచిన విద్యార్థులు జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర, జాతీయస్థాయిలో కూడా రాణించాలన్నారు. సంఘస్వామియాదవ్, రాములు, వకుళభరణం శ్రీనివాస్, రమేశ్, జ్యోతి, హమీద్, రవీందర్‌రావు తదితరులున్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

గంభీరావుపేట: ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న తాడూరి సంపత్‌కుమార్‌ను దమ్మన్నపేట గ్రామస్తులు శుక్రవారం సత్కరించారు. దమ్మన్నపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ టీచర్‌గా పని చేస్తున్న సంపత్ పలు సైన్స్ ప్రాజెక్టులకు గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా అవార్డు వరించింది. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎల్లయ్య, వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భవనం పైనుంచి దూకిన బాలిక

వీర్నపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పర్లపల్లి అక్షిత అనే విద్యార్థి శుక్రవారం సాయంత్రం భవనం పైనుంచి దూకింది. గమనించిన తోటి బాలికలు ఉపాధ్యాయులకు సమాచారమిచ్చారు. ఎల్లారెడ్డిపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. హాస్టల్‌లో చదువుకోవడం ఇష్టం లేకే దూకినట్టు సమాచారం.

'మహాలక్ష్మి' మంజూరు పత్రాలు అందజేత



ముస్తాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం మంజూరు పత్రాలను అందజేస్తుందని కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ అన్నారు. ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో మహాలక్ష్మి పథకం మంజూరు పత్రాలను శుక్రవారం అందజేశారు. ధర్మేందర్ మాట్లాడుతూ.. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేయడం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజల సంక్షేమానికి ఐదు గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఉచిత ఆర్టీసీ బస్ ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.2లక్షల రుణమాఫీ వంటి పథకాలను ప్రజలకు అందించారన్నారు. పంచాయతీ కార్యదర్శి అఫర్, రాజు, మహిపాల్, జక్కయ్య, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.




సిరిసిల్ల: పట్టణంలోని గణేశ్‌నగర్ 22వ వార్డులో మురుగు కాల్వ పక్కనే ఉన్న పార్కులోని కోనోకార్పస్ చెట్లు ఇళ్లపైకి వాలుతున్నాయి. చెట్ల మధ్యలో విద్యుత్ తీగలుండడంతో.. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. కోనోకార్పస్ చెట్లతో శ్వాస సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదముంది. ఇప్పటికైనా స్పందించి ఆ చెట్లను కత్తిరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– చందు, గణేశ్‌నగర్, సిరిసిల్ల

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మీర్జా ఫసత్ అలీబేగ్, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల, ఫోన్ నంబరు: 9849905879

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

నేడు న్యాయవాదులకు ఉచిత వైద్యశిబిరం

సిరిసిల్లకల్చరల్: జిల్లా న్యాయస్థానం ఆధ్వర్యంలో శనివారం న్యాయవాదులకు ఉచితంగా మెగా గుండె వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల సంజీవరెడ్డి, తంగలపల్లి వేంకటి ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ ఫార్చున్ మెడికేర్ హాస్పిటల్ దశాబ్ది వేడుకల నేపథ్యంలో న్యాయవాదులకు ఉచితంగా గుండె స్కానింగ్, టూడీ ఎకో, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు కొనసాగే శిబిరాన్ని న్యాయవాదులతోపాటు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

బోయినపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట లేబర్ కార్డు కలిగిన కార్మికులకు స్క్రీనింగ్ టెస్టులో భాగంగా శుక్రవారం ఎల్‌టీ సదానందం వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త, మూత్ర, బీపీ పరీక్షలు చేశారు. బోయినపల్లికి చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పత్తికుంటపల్లెలో వైద్యశిబిరం

ఇల్లంతకుంట: పత్తికుంటపల్లెలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు అరికట్టడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్టు డాక్టర్ కట్ట రమేశ్ తెలిపారు. 75 మందికి బీపీ, షుగర్ రక్త పరీక్షలు చేసినట్టు చెప్పారు. ఏఎన్‌ఎం కవిత, భారతి, లక్ష్మి, అనిత పాల్గొన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి సన్నిధిలో శుక్రవారం భక్తుల సందడి కనిపించింది. సాయంత్రం 5 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	03	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	28	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	04	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	02	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	06	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	21	560
నందీశ్వర సూట్స్	03	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	22	448
పార్వతీపురం స్పెషల్	23	672
పార్వతీపురం సాధారణ	28	336

– వేములవాడ

మాదక ద్రవ్యాల నిర్మూలన ర్యాలీ


వేములవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వేములవాడఅర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలో శుక్రవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంజయ్య, అధ్యాపకులు మహేందర్‌రెడ్డి, భరత్, సంతోష్, మహేందర్, దేవయ్య తదితరులున్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే శిక్షలు

ముస్తాబాద్: లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తులకు కఠిన శిక్షలు తప్పవని షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై ప్రమీల అన్నారు. ముస్తాబాద్ కస్తూర్బా బాలికల పాఠశాల, నామాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, మాట్లాడినా ధైర్యంగా షీటీంకు ఫిర్యాదు చేయాలన్నారు. సఖీ సెంటర్ ఇన్‌చార్జి సుమలత, ప్రత్యేక అధికారి శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

రుద్రంగి: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌ను వేములవాడ అగ్నిమాపక అధికారి అనిల్ కుమార్ శుక్రవారం సందర్శించారు. అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు పాల్గొన్నారు.

నాటుబాంబు పేలి గేదెకు గాయాలు

కోనరావుపేట: నాటుబాంబు పేలి గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. ధర్మారం గ్రామానికి చెందిన ముడికె మల్లయ్య అనే రైతుకు చెందిన గేదె మేత కోసం సమీపంలోని శివారు ప్రాంతానికి వెళ్లింది. మేత మేస్తున్న సమయంలో నోటికి ఏదో గట్టిగా తగిలింది. అలాగే కొరకడంతో అది పేలింది. ఈ ప్రమాదంలో గేదె మూతిభాగం పూర్తిగా దెబ్బతింది. కాగా మండలంలోని పలు గ్రామాల్లో నాటు బాంబుల తయారీ ఇంకా కొనసాగుతోందని పలువురు భావిస్తున్నారు. పలు అటవీ గ్రామాల్లో ఇదివరకు నాటుబాంబులు పేలి పశువులు, కుక్కలకు గాయాలైన సంఘటనలున్నాయి. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సైన్స్‌ఫేర్‌లో సత్తా చాటిన విద్యార్థులు

వేములవాడఅర్బన్: ఉమ్మడి జిల్లా విభాగ్ లెవల్‌లో భాగంగా కోరుట్ల పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో నాలుగు రోజులుగా జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ పోటీలు నిర్వహించారు. వేములవాడ పట్టణంలోని శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రధానోపాధ్యాయులు చిలుక గట్టు తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణపై పోస్టర్ మేళా

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో జిల్లా స్థాయిలో కౌమార విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు పోస్టర్ మేళా శుక్రవారం నిర్వహించారు. జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. కౌమార దశలో కలిగే శారీరక, మానసిక, ఉద్వేగపరమైన మార్పుల గురించి అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. హెచ్ఐవీ, ఎస్టీఐ సంక్రమిత వ్యాధుల నివారణకు అవసరమైన జీవన నైపుణ్యాలు పెంపొందించడం, మాదకద్రవ్యాల దుర్వినియోగానికి ఇతర ప్రమాదకర ప్రవర్తనలకు ఉన్న సంబంధాలు, లైంగిక వేధింపులు, భావవ్యక్తీకరణ ద్వారా వ్యక్తుల మధ్య ఆరోగ్యవంతమైన సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం, కౌమారానికి సంబంధించిన వివిధాంశాలపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం అధికారి సురేందర్‌రెడ్డి, రాజగోపాల్, సురేశ్, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ శైలజ పాల్గొన్నారు.